"నానమ్మా! నీకే ఫోన్" అంటూ గావుకేక పెట్టింది కీర్తన, తన స్కూల్ బ్యాగ్ సర్దుకుంటూ.

"ఇంత ప్రొద్దుటే నాకు ఫోన్ చేసిందెవరబ్బా!" అనుకుంటూ ఫోన్ దగ్గరికి పరుగున వచ్చింది, మీనాక్షమ్మ.

"ఇంకెవరు మీనాక్షీ! నీ ముద్దుల కూతురే అయివుంటుంది. ఏముందీ గోంగూర పచ్చడిలో చింతపండు వేయాలా వద్దా అన్న ధర్మ సందేహం నివృత్తి చేసుకోడానికి."

భర్త రామారావుని చురచుర ఒక చూపుచూసి, మీనాక్షమ్మ రిసీవర్ అందుకుంది.

"ఏంటే వసూ! ఇంత ప్రొద్దుటే ఫోన్ చేశావ్?"

"అమ్మా! నువ్వొకసారి మధ్యాహ్నం మా ఇంటికి రామ్మా, నేనిప్పుడు ఫోన్లో నీకేమీ చెప్పలేను..." దాదాపు ఏడుస్తూ మాట్లాడుతున్న కూతురి గొంతు విన్న మీనాక్షమ్మ, ఒక్కమారు తెల్లబోయి, వెంటనే తేరుకొని, "ఏంటి! మళ్లీ మీ మామగారేమైనా అన్నారా?" అంది, కొంచెం కోపంగానే.

"మీనాక్షీ! నీకెన్నీసార్లు చెప్పాను, వసువాళ్ల కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకోవద్దని...."

భర్త గట్టిగా మందలించడంలో కొంచెం తగ్గిన మీనాక్షమ్మ, "సరేలే! నేనక్కడికి వస్తాను. ఓ అరగంటలో. నువ్వేం కంగారు పడకు. అయినా, ఇది

# చివరకు మిగలనిది...?

ఎమ్. హేమలత

రోజూ వుండే భాగోతమేగా!" అంటూ ఫోన్ పెట్టేసి, సంగతేమిటన్నట్లు ప్రశ్నార్థకంగా తనకేసి చూస్తున్న భర్తకేమీ సమాధానం చెప్పక వంటగదిలోనికి వెళ్లిపోయింది.

కొడుకు, కోడలు ఆఫీసులకి, మనవరాలు స్కూలుకి వెళ్లిపోయాక భార్యాభర్తలిద్దరూ తీరుబడిగా భోజనానికి కూచున్నారు.

"ఇప్పుడయినా చెప్పు మీనాక్షీ వసు ప్రాబ్లమ్ ఏంటి?"

"అరే! తన ఫ్యామిలీ విషయాల్లో తలదూర్చవద్దన్నారుగా!" అంది, మీనాక్షి భర్తని కాస్తాదెప్పుతూ. మళ్లీ ఏమనుకుందో ఏమో " అది కాదండీ! పాపం వసు ఏమని ఏడాది క్రితం వాళ్లత్తగారు పోయారో అప్పటినుంచి దానికి కష్టాలు మొదలయ్యాయి. అదీ వాళ్ల మామగారితో ...."



"అదేంటీ మీనాక్షీ అలా అంటున్నావు. శ్రీనివాసరావును నేనెరుగనా ఏంటి? ఎంతో సౌమ్యుడాయన. అసలాయన వీళ్ల దగ్గరుండడమే మనమ్మాయికి ఇష్టం లేదులా వుంది!"

"ఛీ.... అదేం మాటండీ! తన మామగారిని కాదనేంత కుసంస్కారి కాదు మన వసుధ. ఆయన్ని ఎంత ప్రేమగా చూసుకుంటుంది. ఈ మధ్య ఆయనలోనే ఏదో మార్పు వచ్చినట్లుంది. ప్రతీదానికీ తప్పులు పట్టడం, కానిదానికీ అయినదానికీ పేచీలు పెట్టడం, ఎడ్డెం అంటే తెడ్డెం అన్నట్లు మాట్లాడుతున్నారట! 'ఇదివరకూ ఇలా వుండేవారు కాదమ్మా మామయ్యా!' అంటూ ఎంత బాధ పడిందనుకున్నారు మొన్న ఫోన్లో!"

"సరేలే! భార్యపోయిన దుఃఖం ఆయునది. భార్య వున్నప్పటిలా జరగడంలేదని ఇన్‌సెక్యూరిటీ ఫీల్ అవుతున్నారేమో పాపం! పెద్దవారు మనమే సర్దుకుపోవాలని నచ్చచెప్పు...." అంటూ, భోజనం ముగించి లేచారు రామారావు.

మీనాక్షి కంచాలూ అవీ తీసి, వంటిల్లు సర్ది, వసూ ఇంటికి వెళ్లొస్తానని భర్తతో చెప్పి బయటకు నడిచింది.

వరండాలో కూర్చుని పేపరు చదువుకుంటున్న శ్రీనివాసరావుని చూసి, పలకరింపుగా నవ్వింది మీనాక్షి.

ఆయన మీనాక్షిని ఓ మారు అలా చూసి, మళ్లీ పేపర్లో తలదూర్చేశారు. మీనాక్షికి కొంచెం విడ్డూరమనిపించినా, మరేం మాట్లాడక లోపలికెళ్లింది.

డ్రాయింగ్ రూములో సోఫాల కవర్లని మార్చుస్తున్న వసుధ, "రామ్మా!" అంటూ ఎదురొచ్చి, "నాన్నగారు రాలేదా?" అంది.

"రాలేదు వసూ! పిల్లలు స్కూళ్లనుంచి వచ్చేటప్పటికి ఎవరో ఒకరు ఇంట్లో వుండాలిగా! అది సరే కానీ, మీ మామగారేంటి నన్ను చూసి కనీసం పలకరించలేదు!" అంది, సోఫాలో కూచుంటూ.

"హుష్!" అంటూ సైగ చేసింది, ఊర్కోమన్నట్లు, వసుధ.

అప్పుడే లోపలికి వచ్చిన వసుధ మామగారు, "అమ్మా వసుధా! నాకింకా కాఫీ ఇవ్వలేదమ్మా!" అంటూ, మీనాక్షికి ఎదురుగా వున్న సోఫాలో కూచున్నారు.

"ఇదుగో! మామయ్యా! ఇప్పుడే తెచ్చిస్తాను." అంటూ, వంటింటికేసి నడుస్తూ, అమ్మని కూడా రమ్మని సైగచేసింది వసుధ.

"బాగున్నారండీ, అన్నయ్యగారూ!" స్నానునయంగా శ్రీనివాసరావుకేసి చూస్తూ అంది మీనాక్షమ్మ, లోపలికెళ్తూ.

ఓ అపరిచితురాలుని చూసినట్లు మీనాక్షమ్మని చూసి, బాగానే వున్నానన్నట్లు తలూపి, సోఫాలో కాళ్లూపుతూ కూచున్నారు, శ్రీనివాసరావు.

"వసూ! ఏంటి మీ మామగారు నన్ను గుర్తుపట్టలేదా! లేక, గుర్తుపట్టనట్లు నటిస్తున్నారా!" అంది, ఆశ్చర్యంగా మీనాక్షమ్మ.

"అమ్మా! కాస్సేపు నువ్వూర్కో. నువ్వొచ్చే ముందే మామయ్య కాఫీ తాగి కప్పు అక్కడ పెట్టారు. కాఫీ ఇవ్వలేదని ఇప్పుడు అంటున్నారు. నిన్ను గుర్తుపట్టకపోవడం అన్నది చాలా చిన్న విషయం." అంటూ, కాఫీ కప్పుతో డ్రాయింగ్ రూములోకి వెళ్లింది వసుధ.

పిల్లలు స్కూళ్లనుండి వచ్చేసరికి మైసూరు బజ్జీలు చేసే ప్రయత్నంలో పడిపోయింది వసుధ. మైదాపిండిని జల్లిస్తూ కూతురు పక్కకూచుంది మీనాక్షమ్మ.

ఉల్లిపాయల్ని ముందేసుకుని కన్నీరు పెట్టుకుంటున్న వసుధను చూసి, "అదేంటి వసూ! అందరికీ ఉల్లిపాయలు కోస్తే కన్నీళ్లు వస్తాయ్. నీకు వాటిని చూస్తేనే వస్తున్నాయే...." అంది మీనాక్షమ్మ కొంత హాస్యాన్ని జోడిస్తూ.

"అమ్మా! నా బ్రతుకే కన్నీటిమయం అయిపోయింది."

"ఛా... అవేం మాటలమ్మా! పెద్దవారు అందునా, ఈ వయసులో భార్యపోయిన డిప్రెషన్‌తో బాధపడ్తున్నట్లున్నారు." అంది, కూతుర్ని సమాధానపరుస్తూ.

"అమ్మా! నాకు మాత్రం తెలీదా! మామయ్యను నేనెంతో కనిపెట్టుకుని చూసుకుంటున్నాను. రెండేళ్లకి ముందు అత్తయ్య ఈ ఊరొచ్చినప్పుడు ఓ మాటన్నారు 'వసుధా! మీ మామయ్య ఒక్కమాటన్నట్లు ఒకమారు వుండడం లేదు. ఆయనకి వెంటవెంటనే మూడ్ మారిపోతూవుంటుంది. ఆయనకు కోపం ఎందుకు వస్తుందో తెలీదు. ఏ మాట అనాలన్నా భయం వేస్తొంది. పరధ్యాన్నం మతిమరుపు పెరిగిపోతూంది. ఇదివరకులా లేదు. కొంత సాధింపు ధోరణి కూడా కనిపిస్తోంది! పెద్దతనం కదా అత్తయ్యా' అంటూ, నేనానాడు మామయ్యనే సమర్థించాను."

కీర్తి, కిరణ్, "మమ్మా!" అంటూ వంటగదిలోకి దూసుకురావడంతో, వసుధ మాటలాపేసింది.

"మమ్మా! తాతగారేంటి ఎక్కడికో వెళుతున్నారు! మాకు రోడ్డు చివర కనిపించారు. ఎక్కడికి తాతగారూ! అంటే ఆన్సర్ చెయ్యకుండా సీరియస్‌గా వెళ్లిపోయారు." అన్నాడు కిరణ్, వసుధతో.

"అదేంటి వసూ! ఇంట్లో వున్న నీకు చెప్పకుండా తలుపులలా బార్లా తెరిచి వెళ్లిపోయారేంటి మీ మామయ్య!" ఆశ్చర్యపోతూ, అంది మీనాక్షమ్మ.

నెత్తి కొట్టుకుంటూ, "ఇదేమంత పెద్ద విషయం కాదులేమ్మా, నీకు తర్వాత చెప్తాను ముందు పిల్లల సంగతి చూడనీ ..." అంటూ పిల్లలందించిన కాళీ లంచ్ బాక్సుల్ని సింకులో పడేసి, డ్రాయింగ్ రూములోకి నడిచింది వసుధ.

"వసూ! ఇంక నేను ఇంటికెళ్తానమ్మా. ప్రొద్దుటే నువ్వు ఫోన్ చేస్తే ఏంటో అనుకొని హడావిడిగా పరిగెత్తుకొచ్చాను. ముసలితనం కదా! మర్చిపోవడం, నిర్లక్ష్యంగా ప్రవర్తించడం సర్వసాధారణంలే. దానికోసరం నువ్వింతగా బాధపడాలా!" అంది, మీనాక్షమ్మ వసుధతో.


"అమ్మా! నాలుగురోజుల క్రితం జరిగిన విషయం నీకు తెలిస్తే నువ్విలా మాట్లాడవు. ఆరోజు అందరి భోజనాలు అయి, పిల్లలు హోంవర్క్ చేసుకుంటున్నారు. నేను టీవీ చూస్తూ కూచున్నాను. మీ అల్లుడుగారు ఏదో మాగజైన్ చదువుకుంటున్నారు. ఇందాక అన్నారు చూడు కాఫీ ఇవ్వలేదని అలాగే, అమ్మా వసూ! ఏంటి నాకు ఇంకా అన్నం వడ్డించలేదు అంటూ వచ్చారు మామయ్య."

"అదేంటోయ్! నాన్నగారికి ఇంత పొద్దుపొయ్యేవరకూ భోజనం పెట్టలేదా" అంటూ, అసహనంగా చూశారు మీ అల్లుడుగారు.

నాకేమని సమాధానం ఇవ్వాలో అర్థం కాలేదు.

నేను మామయ్యని, మా వారిని మార్చి మార్చి చూస్తూ మిన్నకుండిపోయాను. ఏమనుకున్నారో ఏమో మావారు, నావేపు ఓ మారు చూసి చరచరా పడగ్గదిలోకి వెళ్లిపోయారు.

"రండి మామయ్యా వడ్డిస్తాను ..." అంటూ డైనింగ్ టేబిల్ మీద మ్యాట్స్ వేస్తున్న నాకేసి చూస్తూ, "వద్దులేమ్మా! ఆకలిపోయిందిలే..." అంటూ తన గదిలోకి వెళ్లిపోయారు మామయ్య.




కొడుకు రాకముందు, అర్థగంటక్రితం కడుపునిండా భోంచేసిన ఆయనకి మళ్లీ ఆకలి అంటే నమ్మశక్యం కాలేదు నాకు.

అంతటితో అయిపోలేదు. మొన్నటికి మొన్న వంటింటి గట్టు శుభ్రం చేసుకుంటున్న నా దగ్గరకు పిల్లలిద్దరూ వచ్చి, మమ్మా! తాతగారేంటి మా బెడ్‌రూంలో పడుకున్నారు. మరి మేమెక్కడ పడుకోవాలి? అంటూ చెప్పగా,

విషయం కనుక్కుందామని పిల్లల పడగ్గదిలోనికి వెళ్లాను. మామయ్య నన్ను చూసి అమ్మాయ్ ఎందుకమ్మా ఈ రూంలో రెండు మంచాలు వేశావు మీ అత్తయ్య లేదుగా అన్నారు. మామయ్యా! ఈ రూముకి అటాచ్డ్ బాత్‌రూం లేదు కదా! మీ రూములోకి వెళ్లండి అన్నాను, నెమ్మదిగానే.

ఏం! నేనిక్కడ పడుకోకూడదా? నిన్న, నన్ను ఇక్కడే పడుకోమన్నావు ఇవాళ వద్దంటున్నావు! ఔన్లే, మీ దయాదాక్షిణ్యాలమీద ఆధారపడ్డవాణ్ణి. ఇలా అనక ఎలా అంటావ్ అంటూ గొణుక్కుంటూ, నిరసనగా, డ్రాయింగ్ రూములోకి వెళ్లిపోయారు. టీవీ చూస్తున్న మా ఆయన, వసూ! ఎంత గొడవ! పెద్దవాళ్లతో సామ్యంగా నడుచుకోవాలని తెలీదా నీకు అన్నారు కోపంగా.

"అమ్మా! అసలీ ఇంట్లో ఏమవుతున్నదో నాకయితే అర్థం కావడంలేదు. మామయ్య లేనిపోనివన్నీ సృష్టించి నామీద నేరాలు మోపుతున్నారేమో అనిపిస్తూంది నాకు. పని ఒత్తిడితో తండ్రిమీద ప్రేమో, విధేయతో తెలియదు కానీ, ఈ మధ్య ప్రతీదానికి మీ అల్లుడుగారు నామీద చిర్రుబుర్రులాడుతున్నారు. ఇంట్లో ప్రశాంతతే లేకుండా పోతుంది."

తన ఒళ్లో తలపెట్టి భోరుమంటున్న వసుధతో అంది మీనాక్షమ్మ. "ఛా... ఊర్కో వసుధా. నేను గోపాల్‌తో మాట్లాడతాను. నువ్వేం బాధపడకు."

ఎర్రబడ్డ ముఖాన్ని పైకెత్తిన వసుధ, "అమ్మా! ప్లీజ్ ఆ పని మాత్రం చెయ్యొద్దు. నేనేదో నీతో మొరపెట్టుకున్నానని ఆయనకి మరింత కోపం వస్తుంది." అంది.

"సరేలే! ఇవన్నీ చాలా చిన్నవిషయాలు. అవే సర్దుకుంటాయి. నువ్వేమీ మదనపడకు."

కూతురికి ధైర్యం చెప్పి ఇంటిదారి పట్టింది మీనాక్షమ్మ.

000

"అదేంటి మీనాక్షి! చిక్కుడుకాయల్ని కిందపడేసి ఈనెల్ని గిన్నెలో వేస్తున్నావ్?" అన్నారు రామారావు భార్యతో.

అప్పటికీ, ఈ లోకంలో పడ్డ మీనాక్షమ్మ, చేతికి దగ్గరగా వున్న గిన్నెలోకి చూసింది "ఔను కదూ! నేనో పిచ్చిదాన్ని." అంటూ, ఈనెల్ని గిన్నెలోంచి పంపి, కిందున్న చిక్కుళ్లని గిన్నెలోకి వేస్తూ, భర్తకేసి చూసి నవ్వింది.

"బాగుంది. వసుధ మామగారి పరధ్యాన్నం మతిమరపు నీకు పట్టుకున్నట్లుందే". అన్నారు, రామారావు నవ్వుతూ.

"సరేలేండి వసుధ మామగారి విడ్డూర ప్రవర్తనను గురించి విన్నారంటే మీకు మతిపోతుంది." అంది, మీనాక్షమ్మ గిన్నెను లోపల పెట్టేందుకు లేచివెళ్తూ.

"మళ్లీ ఏమయింది మీనాక్షీ!" అన్నారు రామారావు, భార్య వచ్చి పక్కన కూచోగానే.

"వసుధ బాగా అప్‌సెట్ అయిందండీ! మీకీ విషయం చెప్పలేదు కదూ! మొన్నటికి మొన్న ఫీజులు కట్టడానికి పిల్లల స్కూలుకు వెళ్లిందట అమ్మాయి. వాళ్ల మామయ్యతో చెప్తే అలాగే వెళ్లి రామ్మా అన్నారట. ఎంత అరగంటలో తిరిగి రావచ్చు కదా అని వెళ్లిందట. ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి వాకిట్లో కూచుని వాళ్ల మామగారు పేపరు చదువుకుంటున్నారట. లోపలికి వెళ్లగానే ఇల్లంతా గ్యాస్ వాసన గుప్పుమందట. వంటింట్లోకి వెళ్లిన వసుధ గ్యాస్ స్టవ్ ఓపెన్ అయివుండడం చూసి, గబగబా సిలిండర్ క్లోస్ చేసి, కిటికీలు అవి తెరిచిందట.

అదేంటి మామయ్యా! గ్యాసెందుకు ఓపెన్ చేశారు అనంటే టీ పెట్టుకోవాలనుకున్నానమ్మా! డబ్బా ఎక్కడుందో నాకు కన్పించలేదు అన్నారట, తాపీగా. చూశారా! బర్నర్ ఓపెన్ చేసి మర్చిపోయారు. ఇంకానయం ఆయన వెళ్లి ఏ లైట్ స్విచ్చో వెయ్యలేదు అని స్థిమితపడిందట వసుధ. అమ్మాయికి ఆ కంగారు ఎంతసేపటికో గానీ తగ్గలేదట.



"నయం. దేవుని దయవల్ల గండ గడిచింది. మరా విషయం అల్లుడిగారితో చెప్పిందా?"

"చెప్పకుండా ఎలావుంటుంది? చెప్పిందట. అదేదో పెద్ద విషయం కాదన్నట్టు ఓ మారు వాళ్ల నాన్నని నెమ్మదిగా మందలించారుట గోపాల్. ఇంకో విషయం చెప్తావినండి. మొన్న ఆకు కూరలు కొనుక్కుని, తను చిల్లరతెచ్చి ఇచ్చేలోగా అక్కడేవున్న ఆయనగారు. ఇదిగో అమ్మీ నీ కూరల పైసలు తీస్కో అంటూ వందరూపాయలనోటు ఇచ్చేసి వెనక్కితిరిగి వస్తున్నారట. ఏంటి మామయ్యా, పదిరూపాయలకు బదులు వందిస్తున్నారు అని వసుధ అంటే నాకు పదికీ, వందకీ తేడా తెలియనట్టు గద్దిస్తున్నావు. అది పది రూపాయలనోటే' అంటూ సమర్థించుకుంటూ వడివడిగా లోపలికి వెళ్లిపోయారట. మా మామయ్య చేష్టలు నాకు వంటబట్టడం లేదమ్మా" అంటూ వాపోయింది వసుధ నాతో.

"ముందు ఇలా వుండేవారు కాదే! ఓ మారు సైక్రియాట్రిస్ట్‌ను సంప్రదిస్తే మంచిదేమో!"

"ఆ. ఆ భాగోతమూ అయిందట. అమ్మాయి, గోపాల్‌తో ఈ విషయం కదిపితే ఇంతెత్తున లేచాడట, ఏమిటి మానాన్నకి పిచ్చికూడా అంటకడుతున్నావా? అసలాయన ఇక్కడుండడమే ఇష్టంలేనట్లుంది నీకు! అంటూ. వాళ్ల మామగారికేమోగానీ, వసుధకి ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే పిచ్చెక్కేట్టుంది!"

పిల్లలూ, కోడలూ ఇంట్లోకి రావడంతో ఆ ప్రసంగాన్ని అంతటితో ఆపేసింది, మీనాక్షమ్మ.

000

"శేఖర్ అన్నయ్యని రిసీవ్ చేసుకుందుకు ఏర్‌పోర్టుకి వెళ్తున్నాను. అన్నయ్య కోసం రూమది. అరేంజ్ చేశావు కదా!" అన్నాడు గోపాల్ వసుధకేసి చూస్తూ.

ఆ.... ఆ.... బావగారున్న

పదిరోజులూ పిల్లలు మనరూంలో పడుకుంటారు. పిల్లల రూం నీట్‌గా సర్దివుంచాను, బావగారి కోసం. నో ప్రోబ్లమ్."

"ఓ.కే. అయితే నేవెళ్లొస్తాను. అన్నట్లు నాన్నగారేరీ?" అన్నాడు గోపాల్, అటూ ఇటూ చూస్తూ.

"స్నానం చేస్తున్నట్లున్నారు."

"అదేంటి! ప్రొద్దుటే చేశారుగా. పూజ కూడా చేసుకున్నారుగా! మళ్లీ ఇప్పుడెందుకు...?" అంటున్న గోపాల్ మాటల్ని అందిపుచ్చుకున్న శ్రీనివాసరావు. "ఏంట్రా స్నానం అంటున్నావు? ప్రొద్దుట మర్చిపోయానురా. అందుకే ఇప్పుడు చేశాను." అంటూ తన గదిలోకి వెళ్లిపోయారు, ఒళ్లు తుడుచుకుంటూ శ్రీనివాసరావు.

భార్యకేసి ఇదేంటి అన్నట్లు చూసిన గోపాల్‌కి, సమాధానం చెప్పకుండా లోపలికెళ్లిపోయింది వసుధ.

తండ్రి విషయం వస్తే, వసుధ తనతో ముభావంగా ప్రవర్తించడం, మునుపటిలా మనసువిప్పి మాట్లాడకపోవడం, గోపాల్‌కి కొంత బాధ కలిగించింది.

తన ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టి, కారు తాళాలు తీసుకొని బయటపడ్డాడు గోపాల్.

కస్టమ్స్ క్లియరన్స్ అయి, బ్యాగేజి కలెక్ట్ చేసుకొన్న శేఖర్, ఏర్‌పోర్ట్ బయట తన కోసరం వెయిట్ చేస్తున్న గోపాల్ని సమీపించి, కౌగిలించుకున్నాడు ఆప్యాయంగా.

"ఎన్నాళ్లయింది గోపాల్ నిన్ను చూసి"

"ఎన్నాళ్లేంటి అన్నయ్యా! ఎన్నేళ్లు అను. పన్నెండేళ్లయిందేమో కదూ?" అన్నాడు, తనూ ఒక సూట్‌కేస్ రోల్ చేస్తూ.

"పిల్లలకి సరే స్కూలు అనుకో వసుధ వచ్చుండొచ్చు కదా ఏర్‌పోర్టుకి" అన్నాడు శేఖర్.

నవ్వి ఊర్కున్నాడు గోపాల్.

కారు పార్క్ చేసిన స్థలానికి వెళ్లి, డిక్కీలో లగేజీ సర్ది కారు స్టార్టు చేశాడు, గోపాల్.

"అన్నయ్యా! వసుధకి మునుపటిల్లా అంత టైమూ ఇంటరెస్టు కూడా వుండడం లేదులే. అందులో, నాన్న కూడా ఈ మధ్య మాతోనే వుంటున్నారు కదా." అన్నాడు, గోపాల్.

"బాబాయి మీ దగ్గరకి వచ్చి ఏణ్ణార్థం అయినట్టుంది కదా? పాపం పిన్ని పోయాక ఒంటరివాడయిపోయాడు బాబాయ్. ఛా.... ఛా.... అవేం మాటలులే. చెట్టంత కొడుకువి నువ్వూ కూతురిలాంటి వసుధ ఆయన చెంత వుండగా బాబాయి ఒంటరివాడెలా అవుతాడు!" ప్రశ్న వేసి సమాధానం కూడా తనే చెప్పుకుంటున్న అన్నయ్యకేసి ఓ మారు చూసి నవ్వుతూ, గోపాల్ కారు నడపడంలో నిమగ్నుడయిపోయాడు.

ఇంటి ముందు కారాగిన చప్పుడికి, వసుధ గబగబా వచ్చి, "రండి బావగారూ! అక్కయ్యా, పిల్లలు కూడా వచ్చివుంటే సరదాగా వుండేది" అంటూ పలకరించింది నవ్వుతూ.

"అమ్మా! అది అమెరికా! ఎప్పుడు పడితే అప్పుడు రావడానికి ఎలా కుదురుతుంది చెప్పు. నేనయితే మెడికల్ కాన్ఫరెన్స్ మీద ఇలా బయలుదేరివచ్చాను. నీకు తెల్సుకదా మీ అక్కయ్య ఎంత బిజీ గైనకాలజిస్టో. ఇక పిల్లల్ని ఈ టైంలో పిలుచుకువచ్చే ప్రసక్తే లేదు. ఎందుకంటే వాళ్ల స్కూళ్లు తెరిచి వారమైనా కాలేదు." నవ్వుతూ డ్రాయింగ్ రూములోకి వచ్చాడు శేఖర్.

సోఫాలో కూచుని, తదేకంగా టీవీ సీరియల్ చూస్తున్న బాబాయి కాళ్లకి వంగి దణ్ణం పెట్టి, "బాగున్నారా, బాబాయ్!" అన్నాడు శేఖర్.

శేఖర్ని ఓమారు ఎగాదిగా చూసి "ఎవరూ!?" అన్నాడు శ్రీనివాసరావు.

"అదేంటి నాన్నా! శేఖర్ అన్నయ్య కదూ!" అన్నాడు గోపాల్.

"ఓస్! శేఖర్ నువ్వా! కర్నూలు నుండి ఎప్పుడొచ్చావ్? మెడిసన్ అయ్యాక ఏమయినా పై చదువులు చదివావా? అన్నట్టు, అమెరికా వెళ్లాలంటూ, మీ నాన్నని తెగ వేధించేవాడివి! ఇంతకూ వెళ్లలేదన్నమాట! బుద్ధిగా ఇక్కడే వుండిపోయావా? అదీ మంచిదేలే!" అంటూ మళ్లీ టీవీ చూడ్డంలో లీనమయిపోయాడు, శ్రీనివాసరావు.

నొసలు ఎగురవేసి ఓమారు బాబాయి వంక కొంచెం అనుమానంగా చూసిన శేఖర్, గోపాల్ వంక తిరిగి, "ఇదేంటి ఇలా అంటున్నారు బాబాయ్" అన్నట్టు సైగ చేశాడు. ఏం చెప్పాలో అర్థం కానట్లు చూస్తున్న గోపాల్ని ఆదుకోడానికా అన్నట్లు గదిలోకొచ్చిన వసుధ, "బావగారూ! మీరు ముందు స్నానం అదీ



కానిచ్చి భోజనానికి లేవండి. తర్వాత తీరుబడిగా మాట్లాడుకోవచ్చు" అంది.

రాత్రి భోజనాలయ్యాక, పిల్లలు పడగ్గదిలో సెటిల్ అయ్యాక డ్రాయింగ్ రూములోకి వచ్చింది వసుధ.

అన్నదమ్ములిద్దరూ అప్పటికే ఏదో దీర్ఘాలోచనలో వున్నట్లు అర్థం చేసుకుంది వసుధ.

"బావగారూ! మీరయినా నా సమస్యను సానుభూతితో అర్థం చేసుకుంటారనుకుంటాను."

"సమస్యా! నీకేంటమ్మా సమస్య?" అన్నాడు ఆశ్చర్యపోతూ శేఖర్.

"సమస్య నాదని కాదు బావగారూ! ఎవరికీ అర్థం కాని పెనుకుటుంబ సమస్య వచ్చిపడింది. దాన్ని ఎలా విప్పాలో, ఎలా అర్థం చేసుకోవాలో తెలీక కొట్టుమిట్టాడుతున్నాం" ఎంతో బాధతో మాట్లాడుతున్న భార్యను అడ్డగిస్తూ, "వసూ! అన్నయ్య వచ్చీరావడంతోటే నీగోడు వెళ్లబోసుకోవాలా? సంసారమన్నాక ఏదో చిన్నా చితకా సమస్యలొచ్చి పడ్తుంటాయి. వాటిని భూతద్దంలో పెట్టి చూడ్డం నీకీ మధ్య బాగా అలవాటయిపోయింది."

కసురుతున్నట్లు మాట్లాడుతున్న భర్తకేసి ఓ మారు నిరసనగా చూసింది వసుధ.

"అరే గోపాల్! నువ్వూర్కో. అమ్మాయిని చెప్పనియ్యి. నీ సమస్య బాబాయితోటిదే కదమ్మా!" అన్నాడు శేఖర్.

"మామయ్యగారి మీద నేరాలు మోపుతున్నట్లు, మీ తమ్ముడిలా, మీరు కూడా నన్నపార్థం చేసుకుంటే, నేనేమని చెప్పేదండీ, బావగారూ! నా బెంగంతా నాగురించి కాదండీ మామయ్య ఆరోగ్యాన్ని గురించే." అంది బాధగా వసుధ.

"అలాగా!" అన్నట్లు వసుధకేసి చూసిన శేఖర్ "నిజమేనమ్మా! బాబాయిలో ఏదో మార్పున్నట్లే నాకూ అనిపిస్తుంది." అన్నాడు.

"అన్నయ్యా! నువ్వు కూడా ఏంటి వసుధలాగా మాట్లాడుతున్నావ్? వయసువల్ల నాన్నగారికి కొంత సెనిలిటీ వచ్చిందేమో అంతే." అన్నాడు గోపాల్.

"నువ్వుండు గోపాల్! అమ్మా, వసుధా! నువ్వీ మధ్య బాబాయిలో గమనించిన మార్పులు, ప్రవర్తనలో కనిపిస్తున్న వ్యత్యాసాలు నాకు చెప్పు" అన్నాడు శేఖర్.

"బావగారూ! అమెరికాలో మీరు పెద్ద డాక్టర్. వృద్ధులకు వచ్చే వ్యాధుల్ని నయం చేయడంలో ప్రావీణ్యం సంపాదించిన ప్రముఖ గెరియాట్రీషన్ కూడా కదా!"

వసుధ తనని పొగుడుతుంటే, శేఖర్‌కి

నవ్వొచ్చింది.

"అంటే నువ్వనేదేంటి? నాన్నగారికేదో పెద్ద జబ్బువచ్చిందనా!" కోపంగా అంటున్న గోపాల్‌కేసి చూసిన వసుధ, "ఇదండీ బావగారూ ఈయన ధోరణి. నేను చెప్పేది ఏదీ విన్పించుకోరు. అసలు అర్థం చేసుకోడానికే ప్రయత్నించరు. మామయ్యగారిని గత పదిహేనేళ్లుగా నేనెరుగుదును. ఎటువంటి మనిషి ఎలా ప్రవర్తిస్తున్నారు. అత్తయ్యకూడా ఆ మధ్య నాతో చెప్పుకొని బాధపడ్డారు."

"ఔను మరి! డెబ్బయి ఏళ్ల మనిషి మునుపటిలా ఎలర్ట్‌గా వుండమంటే ఎలా వుంటారు?"

"గోపాల్! ఎందుకు అడ్డుకుంటావ్, వసుధని పూర్తిగా చెప్పనియ్యి. చెప్పమ్మా బాబాయిలో నువ్వు చూసిన అబ్‌నార్మాలిటీస్ ఒక్కటొక్కటే నాతో చెప్పు "

వసుధ, శేఖర్‌తో పూసగుచ్చినట్లు అన్నీ చెపుతూ, కళ్లనీళ్ల పర్యంతరం అవడం చూసిన గోపాల్‌కి కూడా కొంచెం బాధనిపించింది.

"చూడమ్మా వసుధా! నీ బాధను నేను అర్థం చేసుకోగలను. సరేనా! నువ్విలా బాధపడ్తూంటే నాకూ కష్టంగా ఉంది. ఏరా గోపాల్! అమ్మాయిని అర్థం చేసుకోవడం పోయి తననే తప్పుపట్టినట్లున్నావు కదూ! అందుకే తనంతగా ఫీల్ అవుతూంది. నువ్వేం భర్తవురా? వసుధా! నేనొక పదిరోజులు ఇక్కడే వుంటాను కదా! బాబాయిలోని మార్పును నేనూ దగ్గరుండి గమనించి, ఏదో ఒక పరిష్కారం చూపించే వెళ్తాను. ఇక వెళ్లమ్మా! గోపాల్! వసుధని తీసుకొని మీ గదిలోకెళ్లు. నాకు నిద్రముంచుకొస్తూంది." అంటూ తన బెడ్‌రూమ్‌లోకి నడిచాడు శేఖర్.

000

శేఖర్ సిటీలో వున్న వారమంతా కాన్ఫరెన్స్‌ల్లో, ప్రముఖ ఫిజీషియన్స్‌తో ఇంటర్ యాక్ట్ అవడంతో గడిపేశాడు. ఏ మాత్రం ఖాళీ వున్నా, తన గౌరవార్థం మిత్రులు ఇచ్చిన విందుల్లో పాల్గొనడంతోనే సరిపోయింది.

'ప్రొద్దున్నే తయారై వెళ్లడానికి, రాత్రి పడుకోడానికీ తప్పిస్తే నువ్వు మాతో గడిపినట్లే లేదు' అంటూ గోపాల్ నిష్ఠూరం ఆడాడు కూడా. కానీ, శేఖర్ బిజీ షెడ్యూల్ అటువంటిది. అతన్ని తప్పుపట్టలేం. 'ఆఖరి వారం మాత్రం ఇల్లు విడిచి బయటకి వెళ్లనులే గోపాల్' అన్న శేఖర్ మాటలు ఆ ఇంటిల్లిపాదికి కొంత ఊరటనిచ్చాయి.

"అమ్మయ్య! ఇన్నాళ్లకి తీరుబడి దొరికింది. రండి, సావకాశంగా మాట్లాడుకుందాం" అన్నాడు శేఖర్.

ప్రొద్దుటే ఆలస్యంగా లేచిన శేఖర్, బ్రేక్‌ఫాస్ట్ తీసుకొనేటప్పటికీ పదిగంటలయ్యింది. పిల్లలిద్దరూ, అప్పటికే స్కూళ్లకి వెళ్లిపోయారు. ఆ సాయంత్రం వాళ్లని లుంబినీ పార్క్‌కి, బోటింగ్‌కి, ఆ తర్వాత షాపింగ్‌కి తీసుకెళ్తానని క్రితం రాత్రి పెద్దనాన్న చెప్పగా, సంతోషంగా స్కూళ్లకెళ్లిపోయారు.

వీక్ ఎన్డ్ కూడా కలుపుకొని సెలవుపెట్టిన గోపాల్ ఇంట్లో వుండిపోయాడు. వేడి వేడి పెసరట్లను వసుధ అందిస్తుంటే అన్నదమ్ములిద్దరూ లొట్టవేసుకొని తింటున్నారు.

"నాన్న తిన్నారా?" అన్నాడు గోపాల్, డైనింగ్ రూముకేసి నడిచివస్తున్న శ్రీనివాసరావుని చూస్తూ.

"ఆఁ అయిందండీ. పిల్లల టిఫెన్ బాక్సులు సర్దేటప్పుడు మామగారికి కూడా వేసాను." అంది, వసుధ పెసరట్టు శేఖర్ ప్లేట్లో వేస్తూ.

"ఒరే నువ్వు శేఖర్‌వి కదూ! నువ్వొచ్చి ఇన్నాళ్లయ్యింది కదా, నిన్ను చూడ్డానికి మీ నాన్న రాలేదేంటి?" అన్నాడు, శ్రీనివాసరావు, శేఖర్ పక్కనే కూచుంటూ.

తెల్లబోతున్న గోపాల్ని వారిస్తూ, అన్నాడు శేఖర్. "బాబాయ్! మీరు ఊర్నుండి ఇక్కడికొచ్చాక, మళ్లీ అటువైపు రాలేదు సరి కదా, కనీసం ఫోన్ కూడా చేయలేదు అంటూ కాంతం అత్తయ్య ఫోన్లో మొన్న కంప్లెయిన్ చేసింది. నేను మనూరు ఓ మారు వెళ్లి రావాలనుకుంటున్నాను, బాబాయ్".

"కాంతమా! ఇప్పుడెక్కడుంది? పిల్లలకు పెళ్లిళ్లు ఏమైనా చేసిందా లేదా?" అంటూ, వెంటనే అక్కడి నుంచి లేచిపోయాడు శ్రీనివాసరావు.

"గోపాల్! కాంతం అత్తయ్య పిల్లలిద్దరి పెళ్లిళ్లు బాబాయే దగ్గరుండి జరిపించారు. నీకు తెల్సు కదా!" అన్నాడు, శేఖర్.

"అదేంటన్నయ్యా! నాన్నకి అంతలా మతిమరుపువచ్చింది?" కొంత ఆశ్చర్యంగా, మరింత బాధగా అన్నాడు గోపాల్.

"వసుధా! నీ వంటపని పూర్తయ్యాక ఓ మారు వస్తావా! మనం ముగ్గురం కల్సి మాట్లాడుకోవల్సినవి చాలా వున్నాయి. ఆఁ అన్నట్లు బాబాయి భోంచేసాక కాసేపు పడుకుంటారు కదూ! ఆ టైంలో అయితే మరీ మంచిది." కాఫీ సిప్ చేసి కప్పును టీపాయ్ మీద పెట్టి లేచాడు శేఖర్.

"అన్నయ్యా! నాకేంటో భయంగా వుంది. అసలు నాన్న ఎందుకిలా బిహేవ్ చేస్తున్నారు?"

గోపాల్ ప్రశ్నకి, శేఖర్ జవాబిచ్చేలోగా, వసుధ లోపలికి వచ్చి గోపాల్ పక్కన కూచుంది.

"ఔను బావగారూ! మామయ్యగారికి ఏమయిందండీ! ఎందుకిలా మారిపోయారు?" ఆదుర్దాగా అంది వసుధ.


"చూడమ్మా! ముందుగా మీరొక విషయం అర్థం చేసుకోవాలి. గోపాల్! ముఖ్యంగా నువ్వు. వసుధే నయం ఏదో ప్రొబ్లమ్ అని పసికట్టింది. ఆమె ఊహించింది నిజమే!"

"అంటే అన్నయ్యా. నాన్నకేమయినా మతి భ్రమణం లాంటిది...."

"ఛా.... ఛా.... ఏంటా మాటలు! ముసలితనం వచ్చినవారికి జ్ఞాపకశక్తి తగ్గడం, మనుషుల్ని గుర్తుపట్టకపోవడం సహజమే కదా! కానీ, బాబాయి పరిస్థితి వేరు. ఈ పదిరోజులుగా బాబాయిని నేను గమనిస్తున్నాను. నాకు అర్థమయినదేమంటే ఆయనకి వార్థక్యంలో వచ్చే సెనిలిటీ, దాంటో పాటు 'ఆల్జీమర్స్' అనే డిసీజ్ కూడా వచ్చినట్లు అనిపిస్తూంది.

"ఆల్జీమర్స్ అంటే ఏంటి బావగారూ? ఆ మధ్య నేనేదో పేపర్లో చదివాను. ఆఁ గుర్తొచ్చింది. రొనాల్డ్ రీగన్‌కి కూడా అదే జబ్బని చదివాను. భార్యను తప్ప మిగిలిన ఎవర్నీ గుర్తుపట్టడట! తనొక్కడు, అమెరికా అధ్యక్షుడన్న విషయం కూడా మర్చిపోయాడట!"

"అంటే అన్నయ్యా! నాన్నకి ఆ డ్రెడ్‌ఫుల్ డిసీజ్ వచ్చిందంటావా?" కాన్సరో, బ్రెయిన్ ట్యూమరో అన్నంత



భయంగా చూశాడు గోపాల్, శేఖర్ కేసి.

"గోపాల్! జబ్బు వచ్చిందనగానే మనం భయపడడం కాదుగా చెయ్యవల్సింది. ఆ జబ్బు లక్షణాలు జబ్బుకు ఇవ్వవలసిన ట్రీట్‌మెంటూ నివారించడం ఎలా .... అంటూ ఆలోచించాలి కానీ"

"నువ్వే చెప్పు అన్నయ్యా! వృద్ధులకు వచ్చే జబ్బులగురించి ఇన్నేళ్లుగా అమెరికాలో పరిశోధన చేస్తున్నావు కదా! నాన్నకి వచ్చిన జబ్బు అల్జీమర్స్ అంటావా? ఈ జబ్బునుండి నాన్న బయటపడేదెలా?" ఆదుర్దాగా అడుగుతున్న భర్తను అడ్డగించింది వసుధ.

"బావగారూ! మామగారికి ఈ డిసీజ్ అని మీరు ఓ నిర్ధారణ కొచ్చారా?"

"మంచి ప్రశ్న వేశావమ్మా. నేను ఇక్కడికొచ్చిన మొదటిరోజే బాబాయి నన్ను గుర్తుపట్టడంలో కొంచెం కష్టపడడం గమనించాను. ఎప్పుడో పదేళ్ల క్రిందటి సంగతి ఇప్పటి విషయమన్నట్లు ప్రస్తావించడం నన్ను ఆశ్చర్యపరచింది. సరే! నువ్వు కొంత సమాచారం అందించావు. ఇక్కడున్న వారం రోజులూ ఆయన్ని జాగ్రత్తగా గమనిస్తూనే వున్నాను." అంటూ, అన్నాడు శేఖర్.

ఎంతో ఆతురతగా, విస్మయంగా వింటున్న దంపతుల్ని చూస్తూ ప్రసంగం కొనసాగించాడు, శేఖర్.

"మీ ఇద్దరి వాలకం చూస్తే ఇదేదో భయంకరమైన, రాకూడని జబ్బన్నట్లు భయపడ్తున్నారు కదూ! ఈ జబ్బుతో బాధపడుతున్న వారి సంఖ్య, ప్రస్తుత ప్రపంచ గణాంకాల ప్రకారం, 18 మిలియన్లు. ఇది 2025 సంవత్సరానికి 34 మిలియన్లుకు, చేరుకుంటుందని ఓ అంచనా. అల్జీమర్స్‌ని గురించి చెప్పబోయేముందు మీకు సాంత్వన కల్గించే విషయం ఒకటి చెప్తాను. అదేమిటంటే బాబాయికొచ్చిన ఈ వ్యాధి ఇంకా మొదటి దశలోనే వుంది."

"అంటే నాన్నకి ఈ జబ్బు మరింత ముదిరే సూచనలున్నాయా అన్నయ్యా?" అన్నాడు గోపాల్.

"అదిగో! ఆందోళన పడకు. సైన్స్ పురోగమించే కొద్దీ వ్యాధులూ అభివృద్ధి దిశన పయనిస్తున్నాయి. సైంటిస్టులు మాత్రం ఊరుకుంటారా? ప్రత్యామ్నాయ విరుగుళ్లూ నిరోధకాలూ నిత్యం కనిపెడ్తూనే వుంటారు. ఈ అల్జీమర్స్ డిసీజ్‌కి కూడా మందుల్ని కనిపెట్టారన్నమాట" అంది సంతోషంగా వసుధ.

"మరీ అంతలా ఆశలు పెట్టుకోకమ్మా! ఇలాంటి వ్యాధి ఒకటున్నదని కనుక్కున్నదే 1906వ సంవత్సరంలో. యాభై మూడు సంవత్సరాల 'అగస్టీడ్' అనే ఆవిడ్ని ఆమె బంధువులు డిమెన్షియాతో సూక్ష్మంగా చెప్పాలంటే మతిభ్రంశంతో బాధపడ్తున్నదని పిచ్చాసుపత్రిలో వుంచారు. పరిచయం లేని వాళ్ల ముఖాలు తడమడం, కోపంగా అరవడం అంతల్లోనే మౌనంగా వుండిపోవడం అనే పెరనోయా ఫిట్స్‌తో బాధపడేది. ఆవిడ చనిపోయాక, 'అలాయిస్ అల్జీమర్' అనే జర్మన్ న్యూరో పాథాలజిస్టు ఆమె మెదడు భాగాన్ని మైక్రోస్కోపులో పరీక్షించి, మెదడు పొరల్లో కొన్ని జంట టిస్యూలు ఇమిడివుండడం వల్ల ఆవిడకి ఆ పరిస్థితి వచ్చింది తప్ప, ఆవిడ పిచ్చిది కాదని నిర్ధారణ చేశాడు. కొత్త ప్రయోగం చేసి ఆయన ఈ వ్యాధిని కనుక్కున్నందువల్ల ఈ డిసీజ్ ఆయన పేరుమీదే పిలువబడుతోంది".

ఏదో పాఠం వింటున్నంత ఉత్సుకతతో వింటున్న గోపాల్, వసుధలు ఒక్కమారు ఊపిరిపీల్చి వదిలారు.

"అంటే, అన్నయ్యా! ఈ జబ్బుకీ, పిచ్చికీ సంబంధం ఉందంటావా? పిచ్చి వాళ్లని ట్రీట్ చేసినట్లు వీళ్లని కూడా ట్రీట్ చేయాలా? ఏ మెంటల్ అసైలమ్‌లోనో వుంచాలా?" భయంగా అడిగాడు, గోపాల్.

"ఛా.... ఛా... అలా ఏం కాదు గోపాల్! నువ్వు మరీ అంత దూరం ఆలోచించవద్దు. నేనిందాక చెప్పినట్లు బాబాయి జబ్బు ఇంకా ప్రాథమిక దశలోనే వుంది. ఈ దశలో మతిమరుపువల్ల వస్తువులపేర్లను మర్చిపోతారు. ఒకప్పుడు ఎంతో ఇష్టపడి చేసే ఇంటిపనులు, వ్యాపకాల పట్ల ఇంటరెస్ట్ కోల్పోతారు. మనం చేయవల్సిందేమిటో తెలుసా మిత్రులతో కల్సి టైం స్పెండ్ చేయడం, సంగీతం వినడం, ధ్యానం, ఎక్సర్‌సైజ్ వంటి కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం ఇవీ, మనం చేయవలసిన పనులు.

"అన్నయ్యా! నాన్నకు వచ్చిన ఈ వ్యాధి ఇంకా మొదటి దశలోనే వుందటున్నావు కదా! రెండవ, మూడవ స్టేజెస్ లోకి రాకుండా ఇప్పుడే మందులిచ్చి ఆపలేమా?" ఆశగా అన్నాడు, గోపాల్.

"అదే గోపాల్! శాస్త్రవేత్తలు ప్రయోగాలు కొనసాగిస్తున్నారు. కానీ, ఏదీ కాంక్రీట్ షేప్‌లోకి రాలేదు. ఒక సైంటిస్టు మరొకరితో విభేదించడం అన్నది సహజం కదా! ఈ జబ్బు వంశపారంపర్యంగా వస్తుందని కొందరంటున్నారు. జబ్బుకు అసలు కారణం రూపాంతరం చెందే ఏపిపి జన్యువని కొందరి అభిప్రాయం. గుండె జబ్బుకు కారణమైన కొలెస్ట్రాల్‌ను రవాణా చేసే లైపో ప్రోటీన్ ఎ పి ఓ ఇ 4 జన్యువు కారణం కావచ్చునని మరి కొందరి అభిప్రాయం. భిన్న భిన్న అభిప్రాయాలను, వేర్వేరు శాస్త్రవేత్తలు వెలిబుచ్చుతూనే వున్నారు. వైద్య సంబంధమైన ఈ విషయాలన్నీ మీకు చెప్పి ఇప్పటికే కలవరపడుతున్న మిమ్మల్ని, మరింత కంఫ్యూజన్‌లో పడేయడం నాకిష్టంలేదు.

ఎంతో ఆతృతగా మీరడుగుతున్నారే 'దీనికి మందులున్నాయా' అని సారీ, అది మాత్రం అంత ఆశాజనకంగా లేదు" అన్నాడు శేఖర్.

గోపాల్, వసుధ ఒకరి మొఖాలొకరు బాధగా చూసుకున్నారు. వారినలా చూసిన శేఖర్, " మీ ఇద్దరూ అలా బెంబేలు పడిపోతే ప్రయోజనం లేదు. ఏ విషయాన్నయినా పాజిటివ్‌గా ఆలోచించడం నేర్చుకోవాలి. మనం ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఈ జబ్బుతో బాధపడేవారికే కాదు, వారిని కనిపెట్టుకొని వుండేవారికి కూడా కౌన్సిలింగ్ అవసరం ...."

"చెప్పండి బావగారూ! మేమేం చెయ్యాలో చెప్పండి" అంది వసుధ .

"చూడు వసుధా! గోపాల్ కన్నా, బాబాయితో నువ్వే ఎక్కువ సమయం గడుపుతావు. నువ్వు ఏమేం చెయ్యాలో జాగ్రత్తగా విను.

"చెప్పండి. మామయ్యగార్ని క్షేమంగా, సంతోషంగా వుంచడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను." ఆర్ద్రంగా అంటున్న వసుధని మెచ్చుకోలుగా చూశాడు, శేఖర్. వసుధని చూడడానికి ముఖం చెల్లక



తలదించుకున్నాడు గోపాల్. అనవసరంగా వసుధని మాటలతో బాధించిన అపరాధభావం అతనిది.

"చూడు వసుధా! మనందరిలా బాబాయి ఆలోచించలేరు. ఆయనకు వచ్చిన వ్యాధి వల్ల ఆయన ప్రవర్తనలో మార్పు వచ్చింది. ఇంకా మార్పు వస్తుంది కూడా. ఇప్పుడయితే ఆయనకు పాత విషయాలు గుర్తున్నాయి. పోను పోనూ మనుషులనే కాక పరిసరాలు కూడా మర్చిపోతారు. ఏ జాగ్రత్తలు తీసుకోవాలి మేము అని నువ్వడగవచ్చు. సాధ్యమయినంతవరకు బాబాయిని ఒంటరిగా వుంచకండి. ఆయన బయటకువెళితే, ఎవరో ఒకరు తోడు వెళ్లండి."

"మేము ఏదో పనిమీద ఇంట్లో బిజీగా వున్నప్పుడు చెప్పాపెట్టకుండా మామయ్య తలుపులు బార్లా తెరిచి బయటకు వెళ్లిపొతారండి"

"అందుకే తలుపులకు తాళాలు వేసి వుంచండి. ఇంటి తాళాలు, కారు తాళాలు ఆయనకు అందుబాటులో లేనిచోట జాగ్రత్త పరచండి. మరో విషయం ఆయనకు ఇష్టమయిన పుస్తకాలు ఫొటోలూ ఆయనకు కన్పించేటట్లు అందేటట్లు వుంచండి. ఆయనకు గుర్తులేని విషయాలను అదేపనిగా గుర్తుచేయడానికి ప్రయత్నించకండి. అలా గుర్తుచేస్తే ఉద్రేకం పెరిగి వాయిలెంట్ అయ్యే ఛాన్సెస్ వున్నాయి. పిల్లలకు కూడా చెప్పండి. ఆయన్ని ఏ విషయంలోనూ అవహేళన చేయవద్దని. కొత్త వాళ్లముందు కించపరుస్తూ మాట్లాడకండి. ఈ వ్యాధి వున్నవారి మానసిక పరిస్థితి అర్థం చేసుకొని సానుభూతిగా మెలగడం ఎంతయినా అవసరం."

"ఆయన్ని ఐసోలేట్ చెయ్యమని అనడం లేదు గోపాల్! స్నేహితుల మధ్య గడపడం కూడా ఒక రిలీఫ్ ఆయనకి. కానీ ఆ స్నేహితులకు ఈయన పరిస్థితి తెల్సి వుండాలి. ఇంకొక విషయం. బాబాయికి సంగీతమంటే చాలా ఇష్టం కదా! మంచి మంచి పాటల క్యాసెట్లు తెప్పించి ఆయనకివ్వండి. సంగీతం వినడం వల్ల వీళ్లకి ఎంతో ఉపశాంతి కలుగుతుంది."

"అన్నయ్యా! నాకో విషయం చెప్పు. వ్యాధి ఎక్కువయితే ఏదయినా హోంలాంటి దాంట్లో పెట్టవలసిన అవసరం వస్తుందంటావా?"

"ఎంతో ఎక్కువయితే తప్ప వీళ్లు అన్ కంట్రోలబుల్ అయిపోరు. ముందుగానే ఏవేవో ఊహించుకొని మనసుపాడుచేసుకోకు. వసుధా! నువ్వు మాత్రం బాబాయిని నీ పిల్లల కన్నా ప్రేమగా, జాగ్రత్తగా చూసుకోవాలి. చూడమ్మా! ఈ జబ్బు వున్నవారిని చూసుకునేవారికి ఆ జబ్బుపట్ల అవగాహన, వృత్తి పట్ల ఓర్పు చాలా అవసరం. బాబాయి చాలా అదృష్టవంతుడమ్మా నీలాంటి కోడలున్నందుకు ..."

"అన్నయ్యా! ఆల్జీమర్స్ మీద జరిగే ప్రయోగాలు సఫలమయి, మందేదైనా కనిపెట్టబడితే నాకు తెలియజేస్తావు కదూ!"

"భలేవాడివి గోపాల్! బాబాయి నీకెంతో నాకూ అంతే, నువ్వంతలా చెప్పాలా? తప్పకుండా తెలియజేస్తాను. అదిగో బాబాయి వస్తున్నారు. బాబాయ్! రేపే నేను స్టేట్స్ వెళ్తున్నాను. మళ్లీ వచ్చినప్పుడు కాంతం అత్తయ్య దగ్గరకి వెళ్దాంలే..." అంటూ శ్రీనివాసరావు వెంట వరండాలోకి నడిచాడు శేఖర్.

"వసూ! నాన్న విషయంలో నిన్ను చాలా బాధపెట్టాను. ప్లీజ్ నన్ను క్షమించు" అన్నాడు గోపాల్, అపాలిజిటిక్‌గా.

ఛా... ఛా.... మనలో మనకు క్షమాపణ లేంటండీ? ఫలానా ప్రాబ్లమ్ అని తెలియక, అయోమయ పరిస్థితిలో అలా బిహేవ్ చేశారేమో! ఇప్పుడు బావగారు వివరించి చెప్పాక ఎంతో ఊరటగా వుంది. ప్రాణం తీసే కాన్సర్, ఎయిడ్స్ లాంటి జబ్బు అయితే భయపడాలి. ఈ అల్జీమర్స్ కెందుకండి భయపడాలి! మామయ్యకే కష్టం రాకుండా చూసుకోవడం మనిద్దరి గురుతర బాధ్యత! ఏమంటారు?" అంది ఎంతో నిబ్బరంగా వసుధ.

వసుధతో ఏకీభవిస్తూ చేయికలిపాడు గోపాల్. ■

## లివర్‌పై ప్రభవం చూపనున్న నిమిసిలిడ్!?

ప్రపంచవ్యాప్తంగా నిమిసిలిడ్ మందును నిషేధిస్తే, భారతదేశంలో మటుకు ఈ మందును విరివిగా వాడుతున్నారు. ముఖ్యంగా పిల్లల విషయంలో మరీను. జ్వరం నొప్పులు తగ్గడానికి డాక్టర్లు ఈ మందుని ప్రిస్కైబ్ చేస్తారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (W.H.O) కూడా ఈ మందుపై ఎప్పుడో నిషేధం విధించింది. అయితే ఇటీవల కాలంలో పిల్లల డాక్టర్లు ఈ మందు వాడడం వల్ల కొంతమంది పిల్లలకు సైడ్ ఎఫెక్ట్ వస్తుందని, కావున దీనిని వాడవద్దని పేరెంట్స్‌కు సలహా ఇస్తున్నారు. ఈ మందు వాడటంవల్ల పిల్లల లివరుపై దుష్ప్రభావం చూపుతుందని వైద్యశాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పిల్లల ఆరోగ్యం దృష్ట్యా ఈ మందును నిషేధించాల్సిన అవసరం ప్రభుత్వంపై వుంది.

జె.

